# నేటి పత్రిక ప్రజా వార్త

తెలుగు వారపత్రిక

# NETI PATRIKA PRAJA VARTHA

Telugu Weekly

సంపుటి: 01 | సంచిక : 03 | తేదీ : 24-31 మే 2021 | విజయవాడ | సంపాదకులు : కొండూరి శ్రీనివాసరావు | పేజీలు : 4 | వెల : రూ. 5.00

VOLUME: 01 | ISSUE: 03 | DATE :24-31 MAY 2021 | VIJAYAWADA | EDITOR:KONDURI SRINIVASARAO | PAGES: 4 | PRICE : RS. 5.00


## బ్లాక్ ఫంగస్‌పై జాగ్రత్తలు తీసుకోండి



అమరావతి నేటి పత్రిక ప్రజా వార్త : బ్లాక్ ఫంగస్ విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంజక్షన్లు తెప్పించుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వైట్ ఫంగస్, ఎల్లో ఫంగస్‌లపైనా సమాచారం వస్తోందని, వాటిపైనా పూర్తి అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ముఖ్యమంత్రి తన క్యాంపు కార్యాలయంలో కోవిడ్, రాష్ట్రంలో ఆక్సిజన్ నిల్వలపై సోమవారం సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ సీఎం (వైద్య ఆరోగ్య శాఖ) ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (నాని), డీజీపీ గౌతమ్ సవాంగ్, కోవిడ్ కమాండ్ కంట్రోల్ ఛైర్మన్ డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, కోవిడ్ టాస్క్‌ఫోర్స్ కమిటీ ఛైర్మన్ ఎం టీ కృష్ణబాబు, వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి (కోవిడ్ మేనేజ్‌మెంట్, వ్యాక్సినేషన్) ఎం.రవిచంద్ర, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ కాటమనేని భాస్కర్, 104 కాల్ సెంటర్ ఇంఛార్జ్ ఎ.బాబు, ఆరోగ్యశ్రీ సీఈఓ డాక్టర్ ఎ.మల్లికార్జున్, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ అండ్ ఎండీ వి.విజయరామరాజుతో పాటు, పలువురు ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. యాస్ తుపాను నేపథ్యంలో ఆక్సిజన్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. రోజు వారీగా కావాల్సిన ఆక్సిజన్‌ను సరఫరా చేయడంతో పాటు, నిల్వలపైనా దృష్టి పెట్టాలి. దీనిపై అత్యంత అప్రమత్తంగా ఉండాలి. 15 వేల ఆక్సిజన్ కాన్‌సెన్‌ట్రేటర్స్ తెప్పిస్తున్నాం. కాబట్టి వాటి నిర్వహణపై దృష్టి పెట్టాలి. అవి సక్రమంగా పని చేసేలా తగిన వ్యవస్థ ఉండాలి. 50 బెడ్లు దాటిన ప్రతి ఆస్పత్రికీ కచ్చితంగా ఆక్సిజన్ సౌకర్యం ఉండాలి. యాభై బెడ్లు దాటిన ఆస్పత్రుల్లో ఆగస్టు చివరి కల్లా ఆక్సిజన్ జనరేషన్ ఏర్పాట్లు పూర్తి కావాలి. అలాగే ఆయా ఆస్పత్రుల్లో కాన్‌సన్‌ట్రేటర్లు కూడా ఉండాలి. సొంతంగా ఆక్సిజన్ ప్లాంట్లు పెట్టుకునే ప్రైవేటు ఆస్పత్రులకు 30 శాతం ఇన్సెంటివ్. వారు కూడా ఆగస్టు చివరి కల్లా ఆక్సిజన్ తయారీ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలి. యాస్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని ఆస్పత్రుల నుంచి కోవిడ్ రోగుల తరలింపుపై తగిన చర్యలు తీసుకోవాలి. ఎక్కడెక్కడి నుంచి వారిని తరలించాలన్న దానిపై వెంటనే నిర్ణయం తీసుకుని, తుపాను ప్రభావం మొదలు కాక ముందే వారిని తరలించాలి. తుపాను కారణంగా తలెత్తే పరిస్థితులను ఎదుర్కోవడానికి తగిన చర్యలు తీసుకోవాలి. కార్పొరేట్ ఆస్పత్రుల మాదిరిగానే ఈ బోధనాసుపత్రుల నిర్వహణ కూడా ఉండాలి. రోగులకు ఇచ్చే ఆహారం నుంచి పారిశుద్ధ్యం వరకూ అన్నీ కూడా నాణ్యంగా ఉండాలి. పదికాలాల పాటు రోగులకు మంచి సేవలు అందించేలా అన్ని బోధనాసుపత్రులు ఉండాలి. ఏ విధంగా ఈ ఆస్పత్రులను నిర్వహిస్తారన్న దానిపై ఓ ప్రణాళికను వివరించాలి. కోవిడ్ లాంటి మహమ్మారులను ఎదుర్కొనేందుకు ఆస్పత్రులను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

## అధికారులు అప్రమత్తంగా వుండాలి



అమరావతి నేటి పత్రిక ప్రజా వార్త :యాస్ తుపాను వల్ల ఉత్పన్నమయ్యే పరిస్థితులు, తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో అధికారులను అప్రమత్తం చేశామని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు .తుపాను వల్ల కోవిడ్ రోగులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సీఎం వైఎస్ జగన్.. అధికారులను ఆదేశించారు. ముందు జాగ్రత్తగా వారిని తరలించాల్సిన పరిస్థితులు ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఆక్సిజన్ ఉత్పత్తి చేస్తున్న ప్లాంట్లకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. ఆక్సిజన్ సిలెండర్లకు రీఫిల్లింగ్ చేసే ప్లాంట్లకూ విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని సీఎం సూచించారు. ఆస్పత్రులకు కరెంటు సరఫరాలో ఇబ్బందులు లేకుండా డీజిల్ జనరేటర్లు ఏర్పాటు చేయాలని, ప్రత్యేకంగా విద్యుత్ సిబ్బందిని ఆయా ఆస్పత్రులకు కేటాయించాలని సీఎం ఆదేశించారు. తుపాను కారణంగా ఒడిశా ప్లాంట్లనుంచి ఆక్సిజన్ సేకరణకు ఇబ్బందులు వస్తే ప్రత్యామ్నాయాలు సిద్ధం చేసుకోవాలన్నారు. తగినంత నిల్వలు పెట్టుకోవాలని అధికారులకు సీఎం ఆదేశించారు. తుపాను ప్రభావిత రోజుల్లో ఆక్సిజన్ కొరత రాకుండా అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని సీఎం అన్నారు. ఆక్సిజన్ సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. తుపాను పరిణామాలను ఊహించి ఆ మేరకు సిద్ధం కావాలని సీఎం సూచించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో కోవిడ్ పేషెంట్లను అవసరమనుకుంటే.. తరలింపు ఇప్పుడే పూర్తికావాలని తెలిపారు. "కోవిడ్ కేంద్రాలకు కరెంటు సప్లైకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఒకటికి రెండు సార్లు పూర్తి స్థాయిలో ఆలోచనలు చేసి సమర్థవంతగా చర్యలు తీసుకోవాలి. అవసరమైన సాంకేతిక సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలి. విద్యుత్ పంపిణీ వ్యవస్థను పునఃసమీక్షించుకుని అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలి. అవసరమైన చోట్ల లోతట్టు ప్రాంతాలనుంచి ప్రజలను తరలించాలని" సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు.

## ఆనందయ్య మందు మంచిదే!



అమరావతి నేటి పత్రిక ప్రజా వార్త :: నెల్లూరు జిల్లా కృష్ణపట్నం ఆనందయ్య ఔషధంలో హానికారమైన పదార్థాలేవీ లేవని ఆయుష్ విభాగం స్పష్టం చేసింది. ఔషధం కోసం మొత్తం 18 మూలికలు వాడినట్లు తెలిపింది. వాటిపై పూర్తిగా చర్చించామని, వివరాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి తెలిపామని ఆయుష్ కమిషనర్ రాములు మీడియాకు వెల్లడించారు. మరో నాలుగైదు రోజుల్లో పూర్తి నివేదిక వస్తుందన్నారు. ఆ మందుతో లబ్ధి జరిగిందని ఎక్కువ మంది చెబుతున్నారని ఆయన అన్నారు. "70 నుండి 80 వేల మందికి పైగా ఇప్పటి వరకు మందులు ఇచ్చామని నిర్వాహకులు చెబుతున్నారు. ఎక్కువ మంది మందు తీసుకోవడం వల్ల ఒకరిద్దరిలో ఇబ్బందులు ఉండొచ్చు. మందులో వాడే పదార్థాలన్నీ ఆయుర్వేదం అంగీకరించినవే. కానీ, ఆయుర్వేద ముందుగా గుర్తించాలంటే కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. క్లాసికల్ ఆయుర్వేదిక్ మెడిసిన్ పుస్తకాల్లో లేని మందు ఏదైనా క్లినికల్ ట్రయల్స్ నిర్వహించాల్సి ఉంటుంది. ఏ మోతాదులో ఆ పదార్థాలు వాడుతున్నారనేది కూడా ముఖ్యమే. ఆయుర్వేదిక్ మెడిసిన్ అని పిలిచేదానికి అవకాశం లేదు. ఈ ఔషధాన్ని కోవిడ్‌కు మందుగా పరిగణించలేం. 'నాటు మందు' అని అవమానించే అవసరం లేదు. ఆ మందు వల్ల ఉపయోగం ఉంది" అని రాములు వివరించారు. వైద్య పరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయన్నది తమకు తెలియదని, దీనిపై కంటి వైద్య నిపుణుల సలహాలు కూడా తీసుకుంటామని రాములు అన్నారు. కంట్లో వేసే చుక్కలపై కొన్ని అనుమానాలు ఉన్నాయని, అవి తొలగిపోయిన తర్వాత దానిపైనా ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. " కళ్లలో వేసే మందులో మూడు పదార్థాలు వేస్తున్నారు. ఆయుర్వేదాన్ని బట్టి ఆ మూడింటి వల్లా నష్టం లేదు. నాణ్యత లాంటి అంశాలు పరిశీలించాల్సి ఉంది. గ్రామస్థులను విచారించిన తర్వాత ఆ ప్రాంతంలో కరోనా కేసులు తక్కువ ఉన్నాయని తెలిసింది. కరోనా మరణాలు కూడా ఆ ప్రాంతంలో ఉన్నాయి. పూర్తి వివరాలను సీఎంకు వివరించాము. మరో నాలుగైదు రోజుల్లో పూర్తి నివేదిక అందిస్తాం" అని రాములు చెప్పారు.

## ఆనందయ్య మందు పంపిణీకి ఓకే!

### -నిపుణుల కమిటీ నివేదిక తరువాత తుది నిర్ణయం



అమరావతినేటి పత్రిక ప్రజా వార్త :: ఆయుష్ కమిషనర్ ఇచ్చిన ప్రాథమిక సమాచారం ప్రకారం.. నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో అనందయ్య తయారుచేస్తున్న మందు పంపిణీకి అభ్యంతరం లేదని ఏపీ వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. విజయవాడలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వంశపారంపర్యంగా ఆయన ఈ మందు తయారుచేసి ఇస్తున్నారని, వీటిలో ఉపయోగిస్తున్న పదార్థాలతో హాని లేనట్లు వెల్లడైందని చెప్పారు. ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చాక తుది నిర్ణయాన్ని ప్రకటిస్తామన్నారు. అయితే ఆయుర్వేద మందుగా దీన్ని గుర్తించడం లేదని, అలా చేయాలంటే కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం శాస్త్రీయతపై నిర్ధారణ, ఇతర అనుమతులు అవసరమవుతాయని ఆయన వివరించారు.

ప్రజలకు అందించడంపై దృష్టి: గోవర్ధన్‌రెడ్డి

ఆనందయ్య మందును ప్రజలకు చేరువ చేయడంపై ఏపీ ముఖ్యమంత్రి జగన్ దృష్టి పెట్టారని వైకాపా జిల్లా అధ్యక్షుడు, నెల్లూరు జిల్లా సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. దీన్ని వాడటం వల్ల ఇబ్బందులు లేవని తేలితే పంపిణీకి అడ్డంకులు తొలగినట్లేనని పేర్కొన్నారు. ప్రభుత్వం అనుమతించిన వెంటనే జిల్లావ్యాప్తంగా అవసరమైన వారందరికీ పంపిణీ చేసే బాధ్యత తనదని అన్నారు. ఆనందయ్య మందును ఆయుష్, ఐసీఎంఆర్, ప్రభుత్వం ఆమోదిస్తే తితిదే ఆధ్వర్యంలో తయారుచేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తితిదే పాలకమండలి సభ్యుడు, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు.

## వుహాన్ ల్యాబ్‌లో ఎవరా ముగ్గురు..?




వ్యూహాన్, నేటి పత్రిక ప్రజా వార్త :: చైనాలోని వుహాన్ ల్యాబ్ విషయంలో మరో సంచలన వార్త బయటకు వచ్చింది. దీంతో వైరస్ ఇక్కడి నుంచే పుట్టుకొచ్చిందనే ప్రచారానికి మరింత బలం చేకూరింది. అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థల నివేదికల ఆధారంగా వాల్‌స్ట్రీట్ జర్నల్ ఒక కథనాన్ని ప్రచురించింది. ఇప్పటికే అణుశాస్త్రవేత్తల జర్నల్ 'బులెటిన్.ఓఆర్‌జీ'లో కూడా ల్యాబ్ లీకేజీపై కథనం వచ్చి సంచలనం సృష్టించింది. (మిగతా 2వ పేజీలో)

## ఒంగోలు కోర్టు సంచలన తీర్పు

### హైవే కిల్లర్ మున్నా కేసులో 12 మందికి ఉరిశిక్ష



ఒంగోలు: నేటి పత్రిక ప్రజా వార్త : ప్రకాశం జిల్లాలో 2008లో సంచలనం సృష్టించిన జాతీయ రహదారులపై హత్య కేసులో మున్నా సహా 12 మందికి జిల్లా 8వ అదనపు సెషన్‌కోర్టు ఉరిశిక్ష ఖరారు చేసింది. మరో ఏడుగురికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అప్పటి కోల్‌కతా- చెన్నై 16వ నెంబర్ జాతీయ రహదారిపై కొన్ని లారీలు, సిబ్బంది, వాటిలో ఉన్న సరకు అదృశ్యం అయిన కేసుల్లో మున్నా హస్తం ఉన్నట్లు ఇటీవల నిర్ధరించిన కోర్టు 3 కేసుల్లో ఉరిశిక్ష ఖరారు చేసింది. 13 ఏళ్ల క్రితం ప్రకాశం జిల్లాలో జాతీయ రహదారిపై లారీలు, సరకు సిబ్బంది అదృశ్యం అయిన కేసుల్ని దర్యాప్తు చేస్తున్న పోలీసులకు కారణాలు అంతు చిక్కలేదు. ఒక కేసుకు సంబంధించి అప్పట్లో డీఎస్పీగా శిక్షణ పొందుతున్న దామోదర్‌కు చిన్న ఆధారం లభించింది. దీనిపై లోతుగా దర్యాప్తు చేసిన పోలీసులకు విస్మయానికి గురి చేసిన విషయాలు తెలిశాయి. ఒంగోలుకు చెందిన అబ్దుల్ సమ్మద్ అలియాస్ మున్నా ఒక గ్యాంగ్‌ను తయారు చేసుకొని ఈ హత్యలు చేసినట్లు తెలిసింది. గతంలో గుప్త నిధుల పేరుతో ధనవంతుల్ని నమ్మించి, వారి నుంచి భారీగా డబ్బులు వసూలు చేసి, హతమార్చిన కేసుల్లో అబ్దుల్ సమ్మద్ నిందితుడు. 2008లో జాతీయ రహదారిపై అధికారిలా కాపుకాసి, లోడ్‌తో వస్తున్న లారీలను ఆపడం, రికార్డులు చూపించాలని కోరడం, అదును చూసి మెడలో తాడువేసి, బిగించి హతమార్చేవాడు. మృతదేహాలను గోతాల్లో కుక్కి తోటల్లో అటవీ ప్రాంతాల్లో పాతిపెట్టి, లారీని సరకును మాయ చేసేవాడు. మద్దెపాడులో ఓ పాడుబడ్డ గొడౌన్‌ను అద్దెకు తీసుకొని అక్కడ లారీని తుక్కుగా మార్చి సరకులు విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. అలా ఆ జాతీయ రహదారిలో 13 మందిని హత్య చేసినట్లు విచారణలో తేలింది. మున్నాను, ఆయన అనుచరుల్ని అప్పట్లో పోలీసులు అరెస్టు చేశారు. మున్నాను కాపాడేందుకు కొంతమంది రాజకీయ నాయకులు తీవ్రంగా ప్రయత్నించారు. ఆ నేత వ్యవహారం పత్రికల్లో రావడంతోపాటు బలమైన ఆధారాలు లభించడంతో కేసు విచారణ కొనసాగించారు. మున్నాకు బెయిల్ రావడంతో బెంగళూరుకు వెళ్లిపోయాడు. పోలీసులకు చిక్కకుండా తప్పించుకున్నాడు. అయితే కర్నూలు పోలీసులు అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మున్నా, అతని గ్యాంగ్ మీద ఏడు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుపై ప్రకాశం జిల్లా 8వ అదనపు సెషన్స్ కోర్టులో వాదోపవాదనలు జరిగాయి. మొత్తం 7 కేసులకు గానూ 3 కేసుల్లో తీర్పు వెలువరించింది. నేరాలు రుజువవ్వడంతో మున్నా సహా 19 మందికి శిక్ష ఖరారు చేసింది. 12 మందికి ఉరిశిక్ష, ఏడుగురికి యావజ్జీవ కారాగార శిక్ష ఖరారు చేసింది.

## ఫౌచీ స్వరం మారింది..!

### దర్యాప్తు కొనసాగింపునకు మద్దతు



వాషింగ్టన్: సార్స్‌కోవ్-2 వైరస్ సహజంగా వృద్ధి చెందిందంటే ఒక పట్టాన నమ్మకం కలగడంలేదని.. దానిపై దర్యాప్తు నిర్వహించాలని అమెరికాకు చెందిన అంటువ్యాధుల చికిత్సా నిపుణుడు ఆంటోని ఫౌచీ పేర్కొన్నారు. ఆయన 'యునైటెడ్ ఫాక్ట్ ఆఫ్ అమెరికా: ఎ ఫెస్టివల్ ఆఫ్ ఫ్యాక్ట్‌చెకింగ్' అనే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా.. (మిగతా 2వ పేజీలో)

## 350 బెడ్స్‌తో కోవిడ్ ఆసుపత్రిగా మార్చి కోవిడ్ రోగులకు చికిత్స



మచిలీపట్నంనేటి పత్రిక ప్రజా వార్త :రానున్న రోజుల్లో అత్యాధునిక వసతులతో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించేందుకు ప్రాజెక్టు తయారు చేయాలని వైద్యాధికారులకు సూచించిన మంత్రి పేర్ని, జిల్లా కలెక్టర్‌రాష్ట్ర రవాణా, సమాచారశాఖ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని), జిల్లా కలెక్టర్ ఎఎండి ఇంతియాజ్‌తో కలసి కలక్టర్ బంగ్లాలో వైద్యాధికారులతో సమావేశం నిర్వహించి మచిలీపట్నంలో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి ప్రస్తుతం అందుబాటులో గల వైద్య సౌకర్యాలు, వైద్య పరికరాలు గురించి సమీక్షించి, రాబోయే రోజుల్లో కోవిడ్ థర్డ్ వేవ్ గాని, ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కొనేందుకు అవసరమైన అత్యాధునిక సౌకర్యాలు, సదుపాయాలు ఏర్పాటుకు అందుకు అవసరమయ్యే నిధుల గురించి చర్చించారు. మంత్రి మాట్లాడుతూ రానున్న రోజుల్లో కోవిడ్ థర్డ్‌వేవ్ పిల్లలపై ప్రభావం చూపనున్నట్లు వార్తల నేపధ్యంలో ఆసుపత్రిలో చిన్న పిల్లల వైద్య విభాగం, గైనిక్ వార్డులలో ఐసియు విభాగాలు అవసరమైన బెడ్స్ ఏర్పాటు చేసి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గైనిక్ విభాగంలో గర్భిణీలు డెలివరీలలో కాంప్లికేటెడ్ కేసులు విజయవాడ రిఫర్ చేయాల్సిన పరిస్దితులు అధిగమించి ఇక్కడే అత్యవసర చికిత్స చేయుటకు అవసరమైన వైద్య పరికరాలు ఐసియు బెడ్స్ ఏర్పాటు అవసరం ఉందన్నారు. ఈ దిశగా వైద్యాధికారులు నివేదిక ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మచిలీపట్నంలో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో 350 బెడ్స్‌తో కోవిడ్ ఆసుపత్రిగా మార్చి కోవిడ్ రోగులకు చికిత్స అందించడం జరుగుతున్నదని అన్నారు. రానున్న రోజుల్లో కోవిడ్ థర్డ్‌వేవ్ గాని, మరేదైన విపత్తుగాని సంభవిస్తే ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండేందుకు ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య వసతులు, పరికరాలతో ఆధునీకరించేందుకు అవసరాలు గుర్తించాలని, ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసి సమర్పించాలని కలెక్టరు ఆదేశించారు. ఇందుకు అవసరమైన నిధులు సమకూర్చేందుకు దాతలు, విదేశాల్లో గల వారు ముందుకు వచ్చారని అన్నారు. ఈ సమావేశంలో ఆర్ డివో ఎన్ఎస్‌కె ఖాజావలి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర మిటిగేషన్ కన్వీనర్ పి. రామచంద్రరాజు, డిసిహెచ్‌ఎస్ డా. జ్యోతిర్మణి, డా. జయకుమార్ , డా. అల్లాడ శ్రీనివాసరావు , డా. మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

Neti Patrika Praja vartha

## సంపాదకీయం

EDITORIAL

# శాంతికి బాటలు పడాలి

దాదాపు 12 రోజుల దారుణ మారణ హోమం ముగిసింది. ఎప్పటిలాగే ఈజిప్టు చొరవతో ఇజ్రాయెల్-హమాస్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. దాడులు మొదలైనప్పుడు ఇజ్రాయెల్‌కు ఆత్మరక్షణ చేసుకునే హక్కుందంటూ వెనకేసుకురావడమే కాక, భద్రతా మండలిలో దానికి అండగా నిలిచిన అమెరికా చివరకు వైఖరి మార్చుకుని తెరవెనక పావులు కదిపి ఈ కాల్పుల విరమణ ఒప్పందం సాకారమయ్యేలా చూసింది. కానీ ఈలోగా గాజా స్ట్రిప్‌లో 230మంది పౌరులు బలయ్యారు. 1,700మంది గాయపడ్డారు. రెండు వేలకుపైగా భవంతులు, ఇళ్లు నేలమట్టమయ్యాయి. పసిపిల్లల నుంచి పండుటాకుల వరకూ ఎందరినో పోగొట్టుకుని, ఆప్తుల్లో అనేకులు ఆసుపత్రుల పాలై విలపించే కుటుంబాలకు లెక్కలేదు. ఎటు చూసినా ఘర్షణలు మిగిల్చిన విధ్వంసమే. మొత్తం 60,000 మంది పౌరులు ఇళ్లూ వాకిళ్లూ వదిలి సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాల్సివచ్చింది. పాలస్తీనాలో ఎన్నో దశాబ్దాలుగా ఈ దృశ్యాలు పున రావృతమవుతూనే వున్నాయి. తాను 'ఉగ్రవాద సంస్థల' నేతల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నానని, వారి సైనిక సంపత్తిని దెబ్బతీస్తున్నానని ఇజ్రాయెల్ చెబుతూ వుంటుంది. అయితే గతంతో పోలిస్తే ప్రతిఘటన పెరిగింది. ఈసారి హమాస్ దాడులకు ఇజ్రాయెల్‌లో ఒక భారతీయ యువతితోనహా 12మంది మరణించారు. ఎవరు ప్రేరేపించారు...ఎవరు రెచ్చి పోయారన్న అంశాల్లో ఎప్పుడూ భిన్న దృక్పథాలుంటాయి. అయితే ఘర్షణలు చెలరేగినప్పుడు మొదటగా తగ్గవలసింది ఎప్పుడూ బలవైన పక్షమే. డోనాల్డ్ ట్రంప్ హయాంలోనైనా, అంతకు ముందు పాలించిన రిపబ్లికన్ అధ్యక్షుల సమయంలోనైనా అమెరికా ఎప్పుడూ ఇజ్రా యెల్‌కు మద్దతుగా నిలిచేది. డెమొక్రాట్లు మాత్రం కొంత ఊగిసలాట వైఖరితో ఇరుపక్షాలకూ శాంతి ప్రబోధం చేయడం రివాజు. ట్రంప్ సృష్టించిన వాతావరణం వల్ల కావొచ్చు... ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ మాత్రం శాంతికి పిలుపునిస్తూనే ఇజ్రాయెల్‌కు ఆత్మరక్షణ చేసుకునే హక్కుందని మొదట్లో చెప్పారు. బహుశా స్వపక్షం నుంచి వచ్చిన ఒత్తిడి వల్ల చివరకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూతో దాదాపు అరడజనుసార్లు మాట్లాడి కాల్పుల విరమణకు సిద్ధపడాలని ఒత్తిడి చేశారు. ఒకప్పుడు మన దేశం ఇజ్రాయెల్ చర్యలను గట్టిగా ఖండించేది. ఐక్యరాజ్య సమితిలో దానికి వ్యతిరేకంగా గళమెత్తేది. కానీ ఆ రోజులు పోయాయి. 2014 తర్వాత గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ చేసిన మొదటి భారీ దాడి కనుక మన ప్రభుత్వం ఏ వైఖరి తీసుకుంటుం దోనన్న ఆసక్తి ప్రపంచ దేశాలన్నిటా వుంది. అయితే ఇజ్రాయెల్‌పై హమాస్ దాడిని ఖండించ డంతోపాటు, ఇజ్రాయెల్ జరిపిన 'ప్రతీకారదాడుల్ని' కూడా భారత్ గతవారం నిరసించింది. వాటివల్ల భారీ సంఖ్యలో జననష్టం జరిగిందని, మహిళలు, పిల్లలు అనేకులు మరణించారని ప్రస్తావించింది. కానీ ఇజ్రాయెల్‌కు ఇది రుచించలేదు. అందుకే తమకు మద్దతునిచ్చిన దేశాలకు ట్విటర్‌లో కృతజ్ఞతలు చెప్పిన నెతన్యాహూ మన దేశం ఊసెత్తలేదు. పాలస్తీనా విషయంలో అమెరికా అనుసరిస్తూ వస్తున్న విధానమే ఇజ్రాయెల్‌కు బలంగా మారుతోంది. ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ వేదికల ప్రమేయం వుంటే...రష్యా, చైనాలకు కూడా పరిష్కార సాధనలో చోటిస్తే ఇజ్రాయెల్ ఇంత దూకుడుగా పోయేది కాదు. పాలస్తీనా ఈసరికే పూర్తి రాజ్య ప్రతిపత్తితో మనుగడ సాగించేది. పశ్చిమాసియాలో తన సైనిక, ఆర్థిక, రాజకీయ పలుకుబడి చెక్కుచెదరకూడదనుకుంటే ఇజ్రాయెల్‌ను గట్టిగా సమర్థించడమే మార్గమని అమెరికా భావిస్తోంది. అదే సమయంలో గాజా స్ట్రిప్‌లో హమాస్ ప్రాబల్యాన్ని తగ్గించడానికి ఏం చేయాలో తోచని ఇజ్రాయెల్ ఉద్దేశపూర్వకంగా అక్కడి జనావాసాలపై దాడులు చేస్తోంది. భయకంపితులైన జనాలు సహజంగానే హమాస్‌పై తిరగబడి, దాన్ని కట్టడి చేస్తారని ఇజ్రాయెల్ వ్యూహం. నిరాయుధులైన పౌరులపై చేస్తున్న దాడులకు జవాబుదారీతనం వహించాల్సిందేనన్న ఒత్తిడి లేనంతకాలం అది ఈ వ్యూహాన్నే అమలు చేస్తుంది. భద్రతా మండలిలో ఎవరు తనకు వ్యతిరేకంగా నిలిచినా, అమెరికా తనకు అండగా నిలబడుతుందన్న భరోసా ఇజ్రాయెల్‌కు వుంది. అది పోగొట్టినప్పుడే పాలస్తీనా సమస్యకు పరిష్కారం లభిస్తుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో శాంతి ఒప్పందం కుదుర్చుకున్నానని, సౌదీ అరేబియాతో మరింతగా స్నేహసంబంధాలు ఏర్పడ్డాయని, ఇక ఇరాన్ కట్టడికి పకడ్బందీ వ్యూహం రూపొంది స్తున్నానని నెతన్యాహూ జబ్బలు చరుచుకున్నారు. కానీ గాజా స్ట్రిప్ నుంచి హమాస్ రాకెట్ దాడులు చేస్తున్న సమయంలోనే అరబ్, ఇజ్రాయెల్ పౌరుల మధ్య మత ఘర్షణలు, వెస్ట్ బ్యాంక్ ప్రాంతంలో ఇజ్రాయెల్ సైనికులతో వేలాదిమంది నిరసనకారులు తలపడటం గమనిస్తే అక్కడ ఇన్ని దశాబ్దాల తర్వాత కూడా ప్రతిఘటన యధాతథంగా వుందని అర్థమవుతుంది. కనుకనే తమకు వాస్తవమైన శాంతి కావాలని ఇజ్రాయెల్ పౌరులు కోరుకుంటున్నారు. తూర్పు జెరూసలేం, వెస్ట్ బ్యాంకుల్లో గత కొన్నేళ్లుగా ఆక్రమిస్తూ వస్తున్న ప్రాంతాలనుంచి వైదొలగి, పాలస్తీనాతో శాంతియుత ఒప్పందానికి ఇజ్రాయెల్ సిద్ధపడినప్పుడే ఆ ప్రాంతంలో ప్రశాంతత సాధ్యమవుతుంది. ఇప్పుడు జరిగిన దురదృష్టకర పరిణామాలు ఆ దిశగా అడుగులు పడేందుకు దోహదపడాలని ఆశించాలి.

## కావటి వెంకట్ మృతి పత్రికా రంగానికి తీరని లోటు



హైదరాబాద్. నేటి పత్రిక ప్రజా వార్త : అనారోగ్యంతో హైదరాబాద్ లోని విరించి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న సీనియర్ జర్నలిస్ట్‌కావటి వెంకట్ యాదవ్ మృతి పట్ల హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.కావటి వెంకట్ గారు అనేక ప్రజా సమస్యల పైన విషయ పరిజ్ఞానం ఉన్న పాత్రికేయులని, మంచి సేవాభావ ఆలోచన కలిగిన వారని, పాత్రికేయునిగా తన ధర్మాన్ని నిర్వహించడంలో ఏనాడూ వెనకడుగు వేయలేదని, బలహీన వర్గాలనుండి అనేక అష్టకష్టాలు గురైనా వృత్తి ధర్మాన్ని మారలేదని దత్తాత్రేయ కొనియాడారు. కావటి వెంకట్ మృతి పత్రికా రంగానికి తీరని లోటని వారి మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని తెలియజేసారు. కావటి వెంకట్ యాదవ్ గారి మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ కష్ట సమయంలో వారి కుటుంబ సభ్యులకు కావలసిన మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు బండారు దత్తాత్రేయ తెలిపారు.

## జిల్లాలో కోవిడ్ పాజిటివిటీ రేట్ 12 శాతానికి తగ్గుదల : జిల్లా కలెక్టర్



మచిలీపట్నం,నేటి పత్రిక ప్రజా వార్త : జిల్లా కలెక్టర్ ఎఎండి ఇంతియాజ్ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఆదిత్యనాథ్‌దాస్, హెల్త్ స్పెషల్ సెక్రటరి అనిల్ సింఘాల్ హెల్త్ కమీషనర్ కె. భాస్కర్ అమరావతి నుండి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో పాల్గొని జిల్లాలో కోవిడ్ పాజిటివిటి 12 శాతానికి తగ్గిందని, కోవిడ్ ఆస్పత్రుల్లో చికిత్స, కోవిడ్‌కేర్ సెంటర్ల నిర్వహణ, ఆక్సిజన్ మేనేజ్‌మెంటు తదితర అంశాలపై సిఎస్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోవిడ్ టెస్టింగ్ కు సంబంధించి జిల్లాలో కోవిడ్ శాంపిల్ పెండింగ్ ఒకరోజులోపు తీసుకున్న శాంపిల్స్ 5434, ఒకటి నుండి మూడు రోజులలోపు 2123, 3 రోజుల నుండి 7 రోజుల లోపు 366 మొత్తం 7923 పెండింగ్ వున్నట్లు కలెక్టర్ వివరించారు. ఒవరాల్‌గా జిల్లాలో కోవిడ్ పాజిటివిటి రేట్ 12 శాతానికి తగ్గిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 7.65 లక్షల మందికి కోవిడ్ వాక్సినేషన్ జరిగిందన్నారు. జిల్లాలో 81 ప్రభుత్వ / ప్రయివేటు కోవిడ్ ఆసుపత్రుల్లో 5 వేల బెడ్స్ ఏర్పాటు చేసి కోవిడ్ రోగులకు చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. మరో 7 కోవిడ్‌కేర్ సెంటర్లు ఏర్పాటు చేసి 3139 బెడ్స్ అందుబాటులో తెచ్చినట్లు తెలిపారు. గత ఏడాది మార్చి నుండి ఇప్పటి వరకు జిల్లాలో 15.56 లక్షల మందికి కోవిడ్ టెస్టులు నిర్వహించగా 82,460 పాజిటివ్ కేసులు నమోదైనట్లు, 11,272 యాక్టివ్ కేసులు 903 మరణాలు సంభవించినట్లు కలెక్టర్ వివరించారు.

# ఫౌచీ స్వరం మారింది..!

(1వ పేజీ తరువాయి)మీరు ఇంకా కరోనావైరస్ సహజంగా వచ్చిందనే నమ్ముతున్నారా? ' అని ప్రశ్నించగా ఆయన స్పందించారు. "నాకు దానిపై నమ్మకం కలగటంలేదు. మనం చైనాలో ఏం జరిగిందనేదానిపై శక్తికొద్దీ దర్యాప్తు నిర్వహించి ఒక నిర్ణయానికి రావాలి. ముఖ్యంగా ఇప్పటికే దీని గురించి తనిఖీ చేసినవారు మాత్రం ఇది జంతువుల నుంచే మనుషులకు సోకినట్లు చెబుతున్నారు. కానీ, ఇంకా తెలుసుకోవాల్సింది ఏదో ఉంది.. దానిని వెలికి తీయాలి. అందుకే వైరస్ పుట్టుక తెలుసుకొనేందుకు ఎప్పుడూ పారదర్శకమైన దర్యాప్తునకు నేను మద్దతు ఇస్తాను" అని పేర్కొన్నారు. ల్యాబ్ నుంచి లీక్ కాలేదని వస్తున్న వాదనలపై ప్రశ్నించగా ఫౌచీ ఆచితూచి స్పందించారు. తాను చైనాలో ఏం జరిగిందనే అంశంపై దర్యాప్తును కొనసాగించడానికి మద్దతు ఇస్తానని తెలిపారు. ల్యాబ్ నుంచి లీక్ అయిందనే వాదనను ఆయన కొట్టిపారేయలేదు. కాకపోతే వుహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీలో 'గెయిన్ ఆఫ్ ఫంక్షన్స్' ప్రయోగాలకు (వైరస్‌లలో మార్పులు చేసే ప్రక్రియ) ఎన్ఐహెచ్, ఎన్ఐఏఐడీ సంస్థల నుంచి నిధులు మాత్రం వెళ్లలేదని ఆయన పునరుద్ఘాటించారు. గతేడాది ఈ వైరస్ ల్యాబ్ నుంచి లీక్ అయిందని డాక్టర్ ఫౌచీ అన్నాడు. జన్యుమార్పిడితో తయారు చేశారనే వాదనలను చాలాసార్లు కొట్టిపారేశారు. మరోపక్క శ్వేత సౌధం కూడా ల్యాబ్‌లీక్ సిద్ధాంతానికి ఆధారాలు లేవని కొట్టిపారేయటం లేదు. కాకపోతే స్వతంత్ర దర్యాప్తు నిర్వహించాలని కోరుతోంది.

# భూముల రీసర్వే వేగవంతంగా పూర్తి చేయండి



నూజివీడు,నేటి పత్రిక ప్రజా వార్త :నూజివీడు డివిజన్ లో జగనన్న శాశ్వత భూహక్కుపథకం కింద భూముల రీ సర్వే కార్యక్రమం వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ ప్రతిష్ట మంగైన్ సర్వేయర్లను ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నూజివీడు డివిజన్ లోని 14 మండలాలకు చెందిన సర్వేయర్లకు లాప్ టాప్ లను సోమవారం సబ్ కలెక్టర్ పంపిణి చేసారు. ఈ సంద´ర్భంగా సబ్ కలెక్టర్ ప్రతిష్ట మంగైన్ మాట్లాడుతూ భూముల రీ సర్వే పనులు అర్థవంతంగా, వేగంగా పూర్తి చేయడంలో సర్వేయర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని సబ్ కలెక్టర్ చెప్పారు. డివిజ న్ లో భూముల రీ సర్వే కార్య క్రమం పూర్తి పారదర్శకంగా జరుగుతున్నదని, వేగవంతంగా పూర్తిచేసేందుకు అవసరమైన సర్వేయర్లను నియమించడం జరిగిందన్నారు. వారికీ ఆధునిక టెక్నాలజీ లో శిక్షణ అందించడంతో పాటు ఆధునిక పరికరాలు అందిస్తున్నామన్నారు. జిల్లాలో గత రెండు సంవత్సరాల నుండి భూమి రికార్డుల స్వచీకరణ కార్యక్రమం కింద భూమి రికార్డులు శుద్దీకరణ చేయడం జరిగిందని, సదరు భూమి రికార్డులు తీసుకుని సర్వే బృందాలు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రతీ భూమిని జిపి ఎస్ సౌకర్యం కలిగిన ఆధునిక పరిజ్ఞానం తో కూడిన డ్రోన్లద్వారా భూముల రీ సర్వే పనులు చేపట్టామన్నారు. నేషనల్ సర్వే శాఖ ఆధ్వర్యంలో సర్వే జరుగుతున్నదని, వ్యవసాయ భూములు, గ్రామ, పట్టణ ప్రాంతాలలో ఉన్న భూముల్లోని రీసర్వే కార్యక్రమం చేపట్టాలన్నారు. భూముల రీ సర్వే కార్యక్రమం వేగవంతంగా జరిగేందుకు సిబ్బందికి ఆధునిక టెక్నాలజీ పై పూర్తి స్థాయి శిక్షణ అందించడం జరిగింద న్నారు. , ప్రస్తుతం చేపడుతున్న సర్వేతో జాయింట్ కుటుంబాలు, విభజన కానీ ఆస్తులకు సంబందించిన భూముల సర్వేలకు సంబందించిన సమస్యలు తొలగుతాయన్నారు.కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ డివిజినల్ ఇన్స్పెక్టర్ రామరాజు, డివిజినల్ పరిపాల నాధికారి ఎం. హరనాథ్, ప్రభృతులు పాల్గొన్నారు.

# కోవిడ్ డిశ్చార్జ్ బాధితుల డ్రాలో విజేతలకు నగదు బహుమతి



మచిలీపట్నం, నేటి పత్రిక ప్రజా వార్త : ప్రభుత్వ కోవిడ్‌కేర్ సెంటర్లలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన వారిలో డ్రా తీసి ముగ్గురు విజేతలకు నగదు బహుమతులు ప్రకటించిన జిల్లా కలెక్టర్‌జిల్లా కలెక్టర్ ఎఎండి ఇంతియాజ్ సోమవారం తమ ఛాంబరులో వైద్యాధికారులతో సమావేశంచమై జిల్లాలో కోవిడ్‌కేర్ సెంటర్లలో కోవిడ్ చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన రోగుల పేర్ల నుండి లాటరీతీసి ప్రధమ, ద్వితీయ, తృతీయ విజేతల పేర్లు ప్రకటిరిచారు. స్థానిక లేడియాంప్థిల్ కళాశాల ఆవరణలో గల కోవిడ్‌కేర్ సెంటర్ లో డిశ్చార్జ్ అయిన రోగులు చిన్నం శ్రీకాంత్ ప్రధమ, సిహెచ్ .మురళీకృష్ణ ద్వితీయ, గూడవల్లిలో కోవిడ్‌కేర్ సెంటరు నుండి ఎం. అరుణకుమారి తృతీయ విజేతలుగా నిలిచారు. ప్రధమ విజేతకు 15 వేల రూ.లు, ద్వితీయ విజేతకు 10 వేల రూ.లు తృతీయ విజేతకు 5 వేల రూ.లు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఫోన్‌లో అందుబాటులోకి వచ్చిన విజేత సిహెచ్. మురళీకృష్ణతో కలెక్టర్ మాట్లాడి వారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ కోవిడ్ ఆసుపత్రులపై వత్తిడి తగ్గించేందుకు ఏర్పాటు గావించిన కోవిడ్‌కేర్ సెంటర్లలో కోవిడ్ చికిత్స పొందుటకు ప్రోత్సహించే విధంగా రివార్డ్ టు రికవర్ అనే కార్యక్రమం గత సోమవారం మొదటి డ్రాతీయగా ఈ రోజు 2వ డ్రా తీసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ విధంగా ప్రతి సోమ వారం డ్రా తీయనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. హోంఐసోలేషన్‌లో వస తులు లేని వారు ప్రభుత్వ కోవిడ్‌కేర్ సెంటర్లలో కోవిడ్ చికిత్స పొందాలని అన్ని వసతులతో భోజన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ విధంగా జిల్లాలో గల కోవిడ్‌కేర్ సెంటర్లలో చికిత్స పొంది చాలా మంది రికవరి అవుతున్నారన్నారు. గత ఏడాది మార్చి నుండి ఇప్పటిదాకా జిల్లాలో 82 వేల మంది పాజిటివ్‌గా నిర్ధారణకాగా, రాష్ట్రంలో ప్రస్తుతం పాజిటివ్ రేటు 20-25 కాగా, జిల్లాలో తక్కువగా 12 శాతంగా వుందన్నారు.అనంతరం వైద్యాధికారులతో కలెక్టరు సమావేశం నిర్వహించి ప్రభుత్వ ఆసుపత్రిలో కోవిడ్ రోగులకు అందిస్తున్న వైద్యం, సౌకర్యాల గురించి ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో బందరు ఆర్ డివో ఎన్ఎస్‌కె. ఖాజావలి , డ్వామా పిడి జి.వి. సూర్యనారాయణ, సూపరింటెండెంటు డా. జయకుమార్ , ఆర్ ఎంవో డా. అల్లాడ శ్రీనివాసరావు , డా. మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

# సమగ్ర భూముల రీసర్వే ఖచ్చితత్వంతో పూర్తి చేయాలి



విజయవాడ,నేటి పత్రిక ప్రజా వార్త :
: భూమి రికార్డులు సమగ్రంగా, భూ యజమానికి పూర్తి భద్రత కల్పించే విధంగా ఉండేందుకు భూముల రీసర్వే ఎంతో దోహదపడు తుందని విజయవాడ సబ్ కలెక్టర్ హెచ్.యం. ధ్యానచంద్ర అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయల విసి సమావేశ మందిరంలో సోమవారం విజయవాడ డివిజన్‌లోని పలువురు మండల సర్వేయర్లకు సబ్ కలెక్టర్ హెచ్. యం. ధ్యానచంద్ర లాప్‌టాప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గయ్యపేట మండలం తకెళ్ళపాడు గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు విజయవంతంగా నిర్వహించాలని అదే బాటలో విజయవాడ డివిజన్‌లో ల్యాండ్ రీసర్వే వేగవంతం చేయడంలో మండల సర్వేయుర్లు కీలక పాత్ర వహిం చాలన్నారు. కంకిపాడు, విజయ వాడ సెంట్రల్, జి.కొండూరు, కంచి కచర్ల, వత్స వాయి మండల సర్వేయర్లకు లాప్‌టాప్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ డివిజనల్ సర్వే ఇన్స్‌పెక్టర్ కె. సుబ్బారావు, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వుహాన్ ల్యాబ్‌లో ఎవరా ముగ్గురు..?

(1వ పేజీ తరువాయి)వీటిల్లో వేటికి వైనా ఆధారాలు చూపించి ఖండించలేదు. కేవలం తమపై దుష్ప్రచారంగానే కొట్టిపారిసింది. ఇప్పుడు తాజాగా అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ఫాక్ట్ షీట్‌లోని విషయాలు బయటకు రావడంతో మరోసారి చైనా పాత్రను ప్రశ్నిస్తున్నాయి.

కరోనా వ్యాప్తికి ముందే శాస్త్రవేత్తలకు అస్వస్థత..

బాహ్య ప్రపంచంలో సార్స్‌కోవ్-2 వైరస్ వ్యాపించడానికి ముందే వుహాన్ ల్యాబ్‌లోని చాలా మంది పరిశోధకులు అస్వస్థతకు గురయ్యారు. వీరిందరిలో కొవిడ్19 లేదా సాధారణ ఫ్లూలో కనిపించే జ్వరం, పొడిదగ్గు వంటి లక్షణాలు ఉన్నాయి. అమెరికా ఇంటెలిజెన్స్ వద్దకు ఈ సమాచారం ఒక నమ్మకమైన అంతర్జాతీయ భాగస్వామి నుంచి వచ్చింది. అత్యంత చాతుర్యంతో చాలా కచ్చితమైన సమాచారం వెల్లడించినట్లు కొందరు అధికారులు వాల్‌స్ట్రీట్‌తో పేర్కొన్నారు. కానీ, వారు ఎందుకు జబ్బుపడ్డారో కారణం మాత్రం తెలియలేదని తెలిపారు.

శాస్త్రవేత్తల అంచనాలకు తగ్గట్టే..

చైనాలోని వుహాన్‌లో 2019 డిసెంబర్ 8వ తేదీన తొలి సార్స్‌కోవ్-2 కేసు నమోదైంది. కానీ, చాలా మంది వైరాలజిస్టులు, అంటువ్యాధుల చికిత్స నిపుణులు మాత్రం అది 2019 నవంబర్‌లోనే వుహాన్‌లో వ్యాపించి ఉంటుందని చెబుతున్నారు. ఇన్ని ఆరోపణలు వస్తున్నా వుహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ మాత్రం రా డేటా, సేఫ్టీ లాగ్స్, గబ్బిలాల్లోని కరోనావైరస్‌లపై పరిశోధనలు చేసిన ల్యాబ్ రికార్డులను మాత్రం ఎవరికీ ఇవ్వడంలేదు.

గతేడాది మార్చిలో హడ్సన్ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో నాటి విదేశాంగ మంత్రి మైక్ పాంపియో మాట్లాడుతూ.. " లెవల్ 3 ల్యాబ్‌లో చాలా రక్షణ ఉంటుంది. అక్కడ కరోనా వైరస్‌లపై పనిచేస్తున్న ముగ్గురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరందరిలో ఇన్‌ఫ్లుయెంజా లక్షణాలు ఉన్నాయి. వీరంతా ఒకే వారంలో తీవ్ర అస్వస్థకు గురి కావడం కానీ, ఆసుపత్రిలో చేరి చికిత్స పొందడంగానీ జరిగింది. పరిశోధకులు జబ్బుపడటమే మొదటి క్లస్టర్ కావచ్చు" అని పేర్కొన్నారు. పాంపియో గతంలో నిఘా సంస్థ సీఐఏ డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. ఆయన ఎంత మంది జబ్బుపడ్డారో కూడా అంకెతో సహా చెప్పారు.

అమెరికా తప్పుదోవ పట్టిస్తోంది..

ఈ కథనంపై వాల్‌స్ట్రీట్ చైనా విదేశాంగ శాఖను వివరణ కోరగా.. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన నివేదికను ఉటంకిస్తూ సమాధానం చెప్పింది. ల్యాబ్ నుంచి లీకయ్యే అవకాశం లేదని పేర్కొంది. అమెరికా ఈ ప్రచారాన్ని రెచ్చగొట్టి తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించింది. గతంలో కూడా చైనా ఈ వైరస్ తమ దేశంలో పుట్టలేదని.. బయట నుంచి వచ్చిందని ప్రచారం చేసింది. ఒక దశలో అమెరికాలోని మేరీల్యాండ్‌లో ఉన్న ఫోర్ట్‌డెట్రిక్ సైనిక స్థావరంలోని ల్యాబ్ నుంచి వచ్చిందని కూడా ఆరోపించింది.

ఈ ఏడాది జనవరిలో వుహాన్ ల్యాబ్‌కు వచ్చిన నిపుణుల బృందంతో బ్యాట్ ఉమెన్‌గా పేరున్న షీఝెంగ్ లీ మాట్లాడుతూ.. ' తమ ల్యాబ్ నుంచి వైరస్ లీక్ కాలేదని తెలిపారు. తమ సభ్యుల్లో ఇప్పటికీ కరోనావైరస్ యాంటీబాడీలు లేవు' అని పేర్కొన్నారు. కానీ, అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ఫ్యాక్ట్‌షీట్ మాత్రం షీ చెప్పిన మాటలు ఎంత వరకు నమ్మశక్యం అనే అంశంపై సందేహాలను వ్యక్తం చేసింది. ఈ ఫ్యాక్ట్‌షీట్‌లో చైనా ల్యాబ్‌ల్లో జరిగిన పలు ప్రమాదాలు, పీఎల్ఏతో కలిసి చేసిన పరిశోధనలను కూడా పేర్కొన్నారు.

నిపుణుల బృందానికి నో..

ప్రపంచ ఆరోగ్య సంస్థ పంపిన నిపుణుల బృందం చైనాలో 76,000 కొవిడ్ కేసుల్లో 92 మంది అక్టోబర్-డిసెంబర్ మొదటి వారం మధ్యలో అస్వస్థకు గురైనట్లు గుర్తించింది. వారి డేటాను ఇవ్వాలని కోరగా చైనా తిరస్కరించింది. ఇక వుహాన్‌లోని బ్లడ్‌బ్యాంక్ నమూనాలు ఇవ్వాలని .. వాటిల్లో 2019 డిసెంబర్ కంటే ముందు నమూనాలను పరిశీలిస్తామని పేర్కొంది. కానీ, వ్యక్తుల ప్రైవసీకి భంగం కలుగుతుందని తొలుత పేర్కొంది. ఆ తర్వాత ఇచ్చేందుకు అంగీకరించినా.. ఆ నమూనాలు పరిశీలించే అవకాశం ఇప్పటి వరకూ నిపుణులకు కల్పించలేదు.

# ఘనంగా హజ్రత్ సయ్యద్ జలాలుద్దీన్ దర్వేష్ షా బాబా ఉరుసు



విజయవాడ, నేటి పత్రిక ప్రజా వార్త :కొండపల్లి గ్రామంలో బి కాలనీ ఆవరణలో వేంచేసి ఉన్న హజ్రత్ సయ్యద్ జలాలుద్దీన్ దర్వేష్ షా బాబా ఉరుసు మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు .ప్రతి సంవత్సరం వైభవంగా భారీ స్థాయిలో నిర్వహించే ఉరుసు మహోత్సవం ఈసారి కరోనా మహమ్మారి వలన కేవలం ముజావర్లు మరియు ముఖ్య వ్యక్తులతో నిర్వహించారు.ఉరుసు మహోత్సవంలో మత గురువు అల్తాఫ్ బాబా పాల్గొని బాబా వారికి చాదర్ మరియు పూలు సమర్పించారు. అనంతరం ప్రపంచ మానవాళిని పట్టిపీడిస్తున్న కరోనా మహమ్మారి వెంటనే తొలగిపోయి ప్రజలందరూ ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ప్రశాంతంగా ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది జిన్నా, మత గురువులు మాక్బుల్ మౌలానా, జాకీర్ హుస్సేన్, దర్గా ముజావర్లు ఖాజా చిస్టీ, మహమ్మద్ యాసీన్, గ్రామ పెద్దలు సయ్యద్ మోసిన్, రంజాన్ బాబు,భాష , కరీం, గని పాల్గొన్నారు.

# యువకుడిని చెంపదెబ్బ కొట్టిన కలెక్టర్: సీఎం సీరియస్



రాయ్‌పూర్, ఛత్తీస్‌గఢ్‌లో కొనసాగుతున్న లాక్‌డౌన్ మధ్య మందులు కొనుగోలు చేసేందుకు బయటకు వచ్చిన ఓ యువకుడిని సూరజ్‌పూర్ జిల్లా కలెక్టర్ రణవీర్ శర్మ చేయి చేసుకోవడంతో పాటు అతని ఫోన్‌ను ధ్వంసం చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో సంచలనమైంది. ఉన్నత స్థాయి అధికారి ఉండి ఆయన వ్యవహరించిన తీరుపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఘటనపై ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. రణ్?వీర్ శర్మను తక్షణమే విధులను నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు.

ఈ మేరకు కలెక్టర్ శర్మను సస్పెండ్ చేసినట్లు సీఎం భూపేశ్ బఘేల్ ఆదివారం ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. విచారకర సంఘటన అనీ, ఇలాంటి చర్యలను సహించమని స్పష్టం చేశారు. యువకుడి కుటుంబానికి క్షమాపణలు చెప్పారు. ఐఏఎస్ అధికారుల సంఘం సైతం కలెక్టర్ చర్యలను తీవ్రంగా ఖండించింది. ఘటనపై ఐఏఎస్ అధికారుల సంఘం సైతం స్పందించింది. ఘటన ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, సివిల్ సర్వెంట్ల ప్రాథమిక సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఉందని పేర్కొంది. సమాజం పట్ల సివిల్ సర్వెంట్లు సానుభూతిని కలిగి ఉండాలని, ఈ క్లిష్ట సమయంలో మరింత ముఖ్యమని చెప్పింది.

ఘటన వివరాల్లోకి వెళితే..

కరోనా మహమ్మారి కేసుల పెరుగుదలతో ఛత్తీస్‌గఢ్‌లో ప్రభుత్వం లాక్‌డౌన్ విధించింది. సూరజ్‌పూర్‌లో శనివారం లాక్‌డౌన్ అమలును కలెక్టర్ రణవీర్ శర్మ.. అటువైపు వస్తున్న ఓ యువకుడిని పిలిచాడు. ఎటు వెళ్తున్నావని ప్రశించారు. ఆ తర్వాత కొద్ది సేపటికే యువకుడిని పంపించి వేశారు. మళ్లీ వెంటనే వెనక్కి పిలిచి.. యువకుడి చేతిలో ఉన్న మొబైల్ ఫోన్‌ను తీసుకొని నేలకేసి కొట్టారు. ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే సదరు యువకుడి చెంప చెల్లుమనిపించాడు. అలాగే అక్కడికి



పోలీసులు చేరుకోగా.. యువకుడిని కొట్టాలని ఆదేశించారు. అయితే, సదరు యువకుడు వైద్య పరీక్షలు, మందుల కోసం బయటకు వెళు తున్నానని చెప్పినట్లు తెలుస్తోంది.

ఎంత చెప్పినా.. చేతిలో ఉన్న పేపర్‌ను చూపేందుకు ప్రయత్నించినా కనీసం పట్టించుకునే ప్రయత్నం చేయలేదు. ఈ ఘటనను రికార్డు చేసి ఓ వ్యక్తి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయగా.. వీడియో వైరల్?గా మారింది. కలెక్టర్?కు వ్యతిరేకంగా ట్విట్టర్?లో హ్యాష్?టాగ్ దేశవ్యాప్తంగా ట్రెండ్ అయ్యింది. ఘటనపై కలెక్టర్ ఓ వీడియో పోస్ట్ చేశారు. సదరు యువకుడు తొలుత టీకా కోసం బయటకు వెళ్తున్నానని చెప్పాడని, సంబంధిత పత్రాలు అడిగితే అతని వద్ద లేవని పేర్కొన్నారు. మళ్లీ తన బామ్మ దగ్గరకు వెళ్తున్నా మాట మార్చాడని.. దీంతో కోపంతో కొట్టినట్లు తెలిపారు. అయితే, తన ప్రవర్తనపై పశ్చాతాపం వ్యక్తం చేస్తూ క్షమాపణలు చెప్పారు..

# ఏపీలో గ్రామ/వార్డ్ సచివాలయ వలంటీర్ ఉద్యోగాలు

విజయవాడ, నేటి పత్రిక ప్రజా వార్త :ంధ్రప్రదేశ్‌లో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ వివిధ జిల్లాల్లో గ్రామ/వార్డ్ సచివాలయ వాలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: గ్రామ/వార్డ్ సచివాలయ వలంటీర్‌లు

మొత్తం పోస్టుల సంఖ్య: 2268

జిల్లాల వారీగా పోస్టులు: శ్రీకాకుళం-397, నెల్లూరు-1006, చిత్తూరు-569, ప్రకాశం-296.

అర్హతలు: పదో తరగతి/ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించాలి. స్థానిక గ్రామ/వార్డ్ పరిధిలో నివశిస్తూ ఉండాలి. వయసు: 18-35 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుంది.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులకు చివరి తేది: 2021 మే 20-25

# డిగ్రీ కళాశాల పది ఎకరాల స్థలం కేటాయింపు



కంచికచర్ల నేటి పత్రిక ప్రజా వార్త :కంచికచర్ల మండలము కంచికచర్ల గ్రామములో ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో గత నాలుగు సంవత్సరాలుగా విజయవాడ ఎస్.ఆర్.ఆర్ కళాశాలలో నడపబడు తున్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల కొరకు పది ఎకరాల స్థలం కేటాయింపు విషయమై స్థల పరిశీలన చేసిన శ్రీయుత జాయింట్ కలెక్టర్ మాధవిలత, శ్రీయుత సబ్ కలెక్టర్ ధ్యాన్ చంద్ గౌరవనీయులైన శ్రీయుత నందిగామ శాసనసభ్యులు మొండితోక జగన్మోహన్ రావు ం మరియు శ్రీమతి వి.రాజకుమారి తహశీల్దారు, కంచికచర్ల వారు మరియు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# యాంటీబాడీ కాక్‌టెయిల్ 59 వేలు



దిల్లీ కొవిడ్ బాధితుల చికిత్సలో ఉపయోగించే యాంటీబాడీ కాక్‌టెయిల్(కాసిరివిమాబ్, ఇమ్డివిమాబ్) భారత మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చింది. ఔషధ తయారీ సంస్థ రోచ్ ఇండియా, సిప్లా సంయుక్తంగా ఈ ఔషధాన్ని నేడు మార్కెట్‌లోకి విడుదల చేశాయి. దీని ధర డోసుకు రూ. 59,750గా నిర్ణయించినట్లు ఈ సంస్థలు ప్రకటించాయి. తొలి బ్యాచ్‌లో భాగంగా లక్ష ప్యాక్‌లను ప్రస్తుతం మార్కెట్‌లోకి విడుదల చేశామని, జూన్ మధ్యలో రెండో బ్యాచ్ ప్యాక్‌లు అందుబాటులోకి తెస్తామని రోచ్ ఇండియా, సిప్లా ఓ ప్రకటనలో తెలిపాయి. ఒక్కో ప్యాక్‌ను ఇద్దరు రోగులకు అందించవచ్చని పేర్కొన్నాయి."యాంటీబాడీ కాక్‌టెయిల్‌ను భారత్‌లో అందుబాటులోకి తీసుకొస్తున్నాం. దీనివల్ల కొవిడ్ బాధితులు ఆసుపత్రికి వెళ్లే అవసరం దాదాపు తగ్గుతుంది. అన్నిరకాల పన్నులతో కలిపి ఈ యాంటీబాడీ కాక్‌టెయిల్ 1200 ఎంజీ ఒక డోసు ధర రూ. 59,750. అన్ని ప్రధాన ఆసుపత్రులు, కొవిడ్ చికిత్సా కేంద్రాల్లో ఈ ఔషధం అందుబాటులో ఉంటుంది" అని రోచ్ ఇండియా సీఈవో వి సిమ్సన్ ఇమ్మాన్యుయెల్ తెలిపారు. ఈ ఔషధానికి భారత కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ ఇటీవల ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే.

ఏమిటీ కాక్‌టెయిల్?కొవిడ్ వైరస్‌ను ఎదుర్కొనే కాసిరివిమాబ్, ఇమ్డివిమాబ్‌ను కలిపి ఈ ఔషధాన్ని అభివృద్ధి చేశారు. అత్యధిక రిస్కులో ఉన్న.. తక్కువ నుంచి ఓ మోస్తరు లక్షణాలున్న రోగుల్లో దీన్ని వినియోగిస్తారు. ప్రయోగశాలల్లో అభివృద్ధి చేసిన ఈ రెండు ప్రతినిరోధకాలను మోనోక్లోనల్ యాంటీబాడీస్ అంటారు. ఇవి మన శరీర రక్షణ వ్యవస్థను అనుకరిస్తూ హానికారక వైరస్‌ల పనిపడతాయి. ఇక సార్స్ కోవ్-2లోని స్పైక్ ప్రోటీన్‌పై పనిచేయడం వీటి ప్రత్యేకత. ఈ ప్రోటీన్‌ను అడ్డుకొంటే వైరస్ మనిషి శరీరంలోని ఏసీఈ2 కణాలకు అతుక్కోదు. ఈ రెండు యాంటీబాడీలు కలిసి స్పైక్ ప్రోటీన్‌లో ఒక ప్రత్యేకమైన భాగంపై పనిచేస్తాయి. ఈ నేపథ్యంలో వైరస్‌లో మ్యుటేషన్లు ఏర్పడినా ఇది పనిచేస్తుంది. దీంతో కొత్త మ్యుటేషన్లను సమర్థంగా అడ్డుకొనే అవకాశం ఉంది.

తక్కువ లేదా ఓ మోస్తరు లక్షణాలు ఉన్నవారికి ఇది బాగా పనిచేస్తుంది. అంతేకాదు, ఈ ఔషధాన్ని 12 ఏళ్లు దాటినవారిపై కూడా వినియోగించవచ్చు. ఒక్కో యాంటీబాడీ 600 ఎంజీ చొప్పున గల, 1200 ఎంజీ ఔషధ సమ్మేళనాన్ని వినియోగించాలి. దీనిని చర్మం కింద ఉండే కండరంలోకి లేదా నరాలకు ఎక్కించవచ్చు. 2 నుంచి 8 డిగ్రీల ఉష్ణోగ్రతలో భద్రపరచవచ్చు. దీనికి సాధారణ రిఫ్రిజిరేటర్లు సరిపోతాయి. గుండె, మూత్రపిండాల వ్యాధులు, మధుమేహం వంటివి ఉన్నవారికి దీనిని వాడితే మెరుగైన ఫలితాలు ఉంటాయి. యాంటీబాడీ కాక్‌టెయిల్ తీసుకొన్నవారు ఆసుపత్రిలో చేరాల్సిన అవసరాన్ని దాదాపు 70శాతం తగ్గించినట్లు ప్రయోగాల్లో తేలింది. దీంతోపాటు నాలుగు రోజుల్లోనే వారు వేగంగా కోలుకొన్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కరోనా బారిన పడినప్పుడు ఈ ఔషధాన్నే తీసుకున్నారు.

# ఆచార్య సింహాద్రి మృతికి గవర్నర్ సంతాపం



విజయవాడ, నేటి పత్రిక ప్రజా వార్త :

ప్రముఖ విద్యావేత్త, ఆంధ్రా విశ్వవిద్యాలయం మాజీ ఉప కులపతి ఆచార్య సి. సింహాద్రి మృతి పట్ల ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ మాననీయ బిశ్వ భూషణ్ హరి చందన్ సంతాపం వ్యక్తంచేశారు. ఆంధ్రా యూనివర్సిటీతో పాటు బెనారస్ హిందూ యూనివర్సిటీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (గుంటూరు)లకు వైస్ చాన్స లర్ గా వ్యవహరించిన సింహాద్రి ఆయా విశ్వవిశ్వవిద్యాలయాల ద్వారా విద్యారంగంలో క్రియాశీలక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. తాను విద్యనభ్యసించిన ఆంధ్రా విశ్విద్యాలయం ఉ పకులపతి స్థాయికి ఎదిగి యువతకు స్ఫూర్తి దాయకంగా నిలిచారన్నారు. గవర్నర్ శ్రీ హరిచందన్ మాట్లాడుతూ డాక్టర్ సింహాద్రి ఇన్స్టిట్యూషన్ ఆఫ్ కాన్స్టిట్యూషనల్ అండ్ పార్లమెంటరీ స్టడీస్ సంచాలకునిగానేకాక, యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ సభ్యునిగా, భారత విశ్వవిద్యాలయాల సంఘం అధ్యక్షుడిగా కీలక పదవులు నిర్వహించారని అన్నారు. గవర్నర్ శ్రీ హరిచందన్ దివంగత డాక్టర్ సింహాద్రికి నివాళులు అర్పించారు సింహాద్రి కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు. ఈ మేరకు రాజ్ భవన్ నుండి ఒక ప్రకటన విడుదల చేశారు

# ఆయుర్వేదంపై పరిశోధన ప్రారంభం

## 4 దశల్లో విశ్లేషించనున్న జాతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ

అమరావతి నేటి పత్రిక ప్రజా వార్త : నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో ఆనందయ్య ఇస్తున్న ఆయుర్వేద మందు పనితీరుపై పరిశోధన ప్రారంభమైంది. జాతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ (సీసీఆర్ఏఎస్) 4 దశల్లో ఆ మందును విశ్లేషించనుంది. మొదటి దశలో భాగంగా మందు తీసుకున్నవారి అభిప్రాయాలను సేకరించనుంది. దీనికి సంబంధించిన బాధ్యతలను విజయవాడలోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన స్థానం, తిరుపతిలోని ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రికి సీసీఆర్ఏఎస్ అప్పగించింది. ఇప్పటికే మందు తీసుకున్న వారి ఫోన్ నంబర్లను పోలీసుల సేకరించిన నేపథ్యంలో విజయవాడ ప్రాంతీయ పరిశోధన స్థానం, ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యులు మందు తీసుకున్న 500 మందికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకోనున్నారు. కరోనా పరీక్షల నివేదిక, మందు వేయించుకున్నప్పటి పరిస్థితిపై ఆరా తీయనున్నారు. ఆ తర్వాత ఉన్న పరిస్థితులు, ప్రస్తుత వైద్య నివేదికపై వివరాలను సేకరించనున్నారు. సీసీఆర్ఏఎస్ ప్రొఫార్మా ప్రకారం వివరాలను పొందుపరచనున్నారు. రెండ్రోజుల్లో దీన్ని



పూర్తిచేయాలని ఆయుర్వేద వైద్యులను జాతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ ఆదేశించింది. మందు ప్రభావం విశ్లేషణ ద్వారా సీసీఆర్ఏఎస్ ప్రాథమిక నిర్ధారణకు రానుంది. పూర్తిస్థాయి పరిశోధనలకు 4 నుంచి 5 వారాలు పట్టే అవకాశముందని వైద్యాధికారులు చెబుతున్నారు.

# పిల్లలపై ప్రభావం..ఆందోళన వద్దు!



దిల్లీ కరోనా వైరస్ మహమ్మారి సెకండ్ వేవ్ ధాటికి యావత్ దేశం వణికిపోతోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో థర్డ్ వేవ్ వస్తే పిల్లలపై తీవ్ర ప్రభావం చూపించనుందని వస్తోన్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. థర్డ్ వేవ్ విజృంభణలో చిన్న పిల్లలు తీవ్రంగా ప్రభావితం అవుతారనే సూచనలు ఇప్పటివరకు లేవని స్పష్టం చేసింది.కరోనా వైరస్ థర్డ్ వేవ్ వస్తే చిన్నారులపై తీవ్ర ప్రభావం చూపించనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే, వీటిని తోసిపుచ్చిన పీడియాట్రిక్స్ అసోసియేషన్.. అవి వాస్తవాల ఆధారంగా అంచనా వేసినవి కావని స్పష్టం చేసింది.

కరోనా వైరస్ చిన్న పిల్లలపై ప్రభావం చూపించకపోవచ్చని, ప్రజలు అంతగా భయపడాల్సిన అవసరం లేదని ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రణ్‌దీప్ గులేరియా స్పష్టం చేశారు. పిల్లలు వైరస్ బారినపడే అవకాశం ఉన్నప్పటికీ వారిలో వైరస్ ప్రభావం మాత్రం తక్కువే ఉంటుందని అభిప్రాయపడ్డారు."ఒకవేళ చిన్నారులు వైరస్ బారినపడిన పడితే.. వారిలో లక్షణాలు కనిపించకపోవచ్చు లేదా స్వల్పంగానే ఉండవచ్చు. సాధారణంగా ఆస్పత్రిలో చేర్పించాల్సిన పరిస్థితులు మాత్రం ఉత్పన్నం కావు" అని నీతి ఆయోగ్(ఆరోగ్యం) సభ్యులు వీకే పాల్ పేర్కొన్నారు. "చిన్నారులకు వైరస్ సోకుతుందనే కొన్ని వాస్తవాలు మనముందున్నాయి. వారిలోనూ ఓ మోస్తరు వరకు పాజిటివ్ కేసులు వెలుగు చూస్తున్నాయి. పిల్లల్లో వైరస్ సంక్రమణ తక్కువగా ఉందని కచ్చితంగా చెప్పలేము. డిసెంబర్-జనవరి మధ్య నిర్వహించిన సీరో సర్వేలో చిన్నారుల్లో సీరోపాజిటివిటీ రేటు పెద్దవారితో దాదాపు సమానంగా ఉంది" అని వీకే పాల్ గుర్తుచేశారు. చిన్నారుల నుంచి వైరస్ ఇతరులకు సోకే ప్రమాదం మాత్రం ఉందన్నారు. కొవిడ్ సోకిన చిన్నారులకు చికిత్స చేసేందుకు వైద్య సదుపాయాలను మరింత మెరుగుపరచుకోవాలని.. అదే సమయంలో వైరస్ సంక్రమణలో వీరిని ముందు వరుసలో రాకుండా చూసుకోవడమే అత్యంత ముఖ్య విషయమన్నారు.దేశంలో సెకండ్ వేవ్‌తో వణికిపోతున్న పలు రాష్ట్రాలు థర్డ్ వేవ్‌ను ఎదుర్కొనేందుకు కూడా సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా పిల్లలపై ప్రభావం చూపిస్తుందన్న నిపుణుల హెచ్చరికలు ఆందోళనకు కారణమవుతున్నాయి. ఈ నేపథ్యంలో వైరస్ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు వారికి చికిత్స కోసం వైద్య సదుపాయాలను మరింత మెరుగుపరచుకోవాలని కేంద్ర ఆరోగ్యశాఖ సూచిస్తోంది.

# కొవిడ్ కట్టడికి ద్విముఖ వ్యూహం: కేసీఆర్

హైదరాబాద్, నేటి పత్రిక ప్రజా వార్త :: రాష్ట్రంలో కరోనా మహమ్మారి నివారణకు ద్విముఖ వ్యూహాన్ని అనుసరించాలని తెలంగాణ సీఎం కేసీఆర్ అన్నారు. కరోనా పరిస్థితి, లాక్‌డౌన్ అమలు సంబంధిత అంశాలపై మంత్రులు, ఉన్నతాధికారులతో ప్రగతి భవన్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఫీవర్ సర్వే, మెడికల్ కిట్ల పంపిణీ సత్ఫలితాలు ఇస్తోందని, దీనిని కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. కరోనా పరీక్షల సంఖ్యను మరింతగా పెంచాలన్నారు. పీహెచ్‌సీల్లో ప్రతి ఒక్కరికీ కరోనా పరీక్షలు చేయాలని, ర్యాపిడ్ యాంటీ జెన్ టెస్టు కిట్ల సంఖ్య పెంచాలని చెప్పారు. రేపటి నుంచి అన్ని వైద్య కేంద్రాల్లో కిట్ల సంఖ్యను పెంచాలని అన్నారు. బ్లాక్ ఫంగస్ చికిత్సకు పడకలు, మందులు సమకూర్చుకోవాలని తెలిపారు.

కొవిడ్ కట్టడికి ఎంత ఖర్చయినా వెనుకాడొద్దు!

రాష్ట్రంలో కరోనా తగ్గుముఖం పడుతోందని సీఎం కేసీఆర్ అన్నారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా లాక్‌డౌన్ కఠినంగానే అమలవుతోందన్నారు. ర్యాపిడ్ యాంటీజెన్ కిట్ల సంఖ్యను 50 లక్షలకు పెంచాలని ఆదేశించారు. ఉత్పత్తిదారులతో మాట్లాడి పరీక్షా కేంద్రాలకు కిట్ల సరఫరాను పెంచాలన్నారు. " వైద్య కేంద్రాల్లో సిబ్బంది నియామక ప్రక్రియ వేగవంతం చేయాలి. నియామకాలు, మందులు, సౌకర్యాలపై డీఎంహెచ్‌వోలతో మాట్లాడాలి. కరోనా కట్టడికి ఎంత ఖర్చయినా వెనుకాడవద్దు. ఖర్చు తగ్గే అవకాశాలను శాఖలు గుర్తించాలి. పోలీస్, వైద్యారోగ్య శాఖలకు బడ్జెట్ పెంచాలి. బడ్జెట్ తగ్గింపు, పెంపుపై మంత్రి హరీశ్‌రావు సమీక్షించాలి" అని కేసీఆర్ అన్నారు.

థర్డ్‌వేవ్ వస్తే ఎదుర్కొనేందుకు సిద్ధంకండి

కరోనా కట్టడిపై దిల్లీ సహా తదితర చోట్ల అధ్యయనం చేయాలని, అన్ని పడకలను ఆక్సిజన్ పడకలుగా మార్చాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో ఆక్సిజన్ ఉత్పత్తిని 600 టన్నులకు పెంచాలన్నారు. రెండో డోసు టీకా కోసం ఉత్పత్తిదారులతో మాట్లాడాలని, కరోనా మూడో వేవ్ వస్తే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. బ్లాక్ ఫంగస్ చికిత్స కోంస ఆస్పత్రుల్లో పడకలు ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలో బ్లాక్ ఫంగస్ చికిత్సకు



1,500 పడకలు ఏర్పాటు చేయాలని సూచించారు. సరోజినీదేవి ఆస్పత్రిలో 200, గాంధీ ఆస్పత్రిలో 160 బెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. బ్లాక్ ఫంగస్ ఔషధాల కోసం తక్షణమే ఆర్డర్ ఇవ్వాలని, చికిత్స కోసం వైద్యులను నియమించుకోవాలని కేసీఆర్ ఆదేశించారు. ప్రభుత్వానికి కరోనా కట్టడికి మించిన ప్రాధాన్యం లేదని సీఎం స్పష్టం చేశారు. అవసరమైతే అప్పు తెచ్చి అయినా కరోనా కట్టడికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

రేపటి నుంచి రెండో డోసు ప్రారంభం

రెండో డోసు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మంగళవారం నుంచి ప్రారంభించాల్సిందిగా సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే మొదటి డోసు పూర్తిచేసుకొని రెండో డోసు కోసం అర్హత కలిగిన వాళ్లు దగ్గరలోని ప్రభుత్వ వాక్సినేషన్ కేంద్రానికి వెళ్లి వ్యాక్సిన్ వేయించుకోవాలని సీఎం కోరారు. సూపర్ స్ప్రెడర్లను గుర్తించి వారికి ప్రత్యేకంగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని, అందుకు సంబంధించిన విదివిధానాలను రూపొందించాలని మంత్రి హరీష్ రావును, వైద్యారోగ్యశాఖ అధికారులను కేసీఆర్ ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్, సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డితోపాటు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

